# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 113 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

01-03-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4


# డయేరియా బాధితులకు ధైర్యం

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు ఆగ్రహం
- జేమ్స్ హాస్పిటల్‌లో 22 డయేరియా బాధిత కుటుంబాల పరామర్శ
- ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం పూర్తిగా విఫలం- తీవ్ర విమర్శ
- బాధితులకు అండగా ఉంటామని హామీ

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగరంలోని జేమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 22 డయేరియా బాధిత కుటుంబాలను యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు శనివారం ఉదయం 11:30 గంటలకు పరామర్శించారు. బాధితులను వ్యక్తిగతంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కలుషిత నీటి సమస్యలు పునరావృతమవుతున్నా అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, నిర్లక్ష్యం వల్లే ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నగరంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపర్చాలని, బాధిత కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మాన రామ్ మనోహర్ నాయుడు డిమాండ్ చేశారు.





# శాస్త్రీయ దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం

**నవతరం -శ్రీకాకుళం**

## జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



విద్యార్థుల్లో పరిశోధనా జిజ్ఞాసను పెంపొందించేలా పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీ సాయి విద్యా మందిర్ స్మార్ట్ స్కూల్‌లో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 500 మంది విద్యార్థులు రూపొందించిన 175 వినూత్న ప్రాజెక్టులను ఆయన పరిశీలించి, విద్యార్థుల మేధోసంపత్తిని అభినందించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ రహిత తొలి పాఠశాలగా ఈ సంస్థ నిలవడం అభినందనీయమన్నారు. డిప్యూటీ ఈఓ విజయకుమారి, ఎంఈఓలు సుజాత, ఎం.కృష్ణారావు హాజరై సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు.
ఈ ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన వ్యర్థ జలాల శుద్ధి, ఆటోమేటిక్ ఫైర్ మిషన్, కార్బన్ ప్యూరిఫికేషన్, గూగుల్ రోబోట్, కంపోస్ట్ విద్యుత్, ప్రకృతి వ్యవసాయం, నాగావళి నది పరిరక్షణ, చంద్రయాన్ రహస్యాలు, భూకంప హెచ్చరికల నమూనాలు

-మిగతా 2లో

# పేదలకు 18 లక్షల ఇళ్లు ప్రభుత్వ లక్ష్యం

**నవతరం -శ్రీకాకుళం**



2029 నాటికి రాష్ట్రంలోని అర్హులైన పేదలకు 18 లక్షల ఇళ్ల నిర్మాణం చేయాలన్న లక్ష్యంగా దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం పట్టుపురం, మణి నాగేశ్వర పురం గ్రామంలో శనివారం పర్యటించారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పట్టుపురం గ్రామంలోని ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రూ.కోటి 63 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలన్న కృతనిత్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. 2014 - 19 కాలంలో పేదల నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు కానీ లబ్ధిదారులకు బిల్లులు త్వరలో చెల్లించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇందుకు సుమారు రూ.900 కోట్ల రూపాయలు నిధులు అవసరమున్నట్లు తెలిపారు. కొత్తగా ఇల్లు కావలసిన లబ్ధిదారులు స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఆన్లైన్ దరఖాస్తు చేసుకుంటే గృహ నిర్మాణ శాఖ అధికారులు విచారించి అర్హులకు ఇల్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవానికి పక్క ఇల్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని అన్నారు. ఏడాదిలోగా రాష్ట్రంలో గ్రామాల్లో సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు గుర్తు చేశారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా సంక్షేమ పింఛన్లు పంపిణీ కోసం 20 మాసాల్లో రూ.55 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామానికి సాంకేతికత అందుబాటులోకి తెచ్చేందుకు 6 వేల సెల్

-మిగతా 2లో

# ముఖ్య మంత్రి సహాయ నిధి పేదల సంక్షేమానికి పునాది ..!!

**నవతరం -పలాస**



పలాస నియోజకవర్గంలోని ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు పలాస శాసనసభ్యులు శ్రీమతి గౌతు శిరీష ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ఒక వరం లాంటిదని ఆమె పేర్కొన్నారు.
శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, నియోజకవర్గంలోని నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 4,21,190.00/- విలువైన జవీ=ఖీ చెక్కులను ఆమె స్వయంగా అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, "ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నా ప్రథమ కర్తవ్యం. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రతి ఒక్క అర్హుడికి సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాను. ఇది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, మానవతా దృక్పథంతో మనం అందించే భరోసా," అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో భాగంగా, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందింది. వీరిలో గాడి ఈశ్వరరావు రూ. 20,000/- సైనూరు, వజ్రపుకొత్తూరు మండలం, పిచ్చుక జాస్మిన్ 39, 883/- దున్నవూరు మందస మండలం, తమ్మినాన మౌళి కొత్త ఊరు పలాస మండలం రూ. 2,29,395/-, తామరపల్లి శ్రీనివాస్ C/O తామరపల్లి ధనము రెంటికోట పలాస మండలం 1,31,912/, చొప్పున చెక్కులను ఎమ్మెల్యే శిరీష గారు అందజేశారు. ప్రభుత్వం నుండి సకాలంలో అందిన ఈ సహాయానికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శిరీషకు మరియు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఆయా వార్డులు, పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులు, మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాల యజమానులకు నోటీసు జారీ చేయాలి



**నవతరం -శ్రీకాకుళం**

- చేపల మార్కెట్ వద్ద తాగునీరు కుళాయి లీకేజి
- బాధ్యులపై చర్యలు తప్పవు
- ఇంటింటి సర్వేలో కేసులు తగ్గుముఖం పట్టాయి
- ఆసుపత్రులలో ప్రస్తుతం 96 కేసులు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పట్టణంలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. విశాఖ బి, ఇందిరానగర్ కాలనీలలో శనివారం పారిశుద్ధ్యాన్ని, కాలువలు పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా అక్కడ నిర్వాసితులకు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చెత్తను తీసివేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి చెత్తను కలెక్షన్ చేసే మైక్రో పోకెట్స్ ఎన్ని ఉన్నాయని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త విపరీతంగా పేరుకుపోయిందని, దాని వలన దోమలు, తదితరమైనవి చేరుతాయని చెప్పారు. ఖాళీ స్థలాలను సందర్శించి అక్కడ చెత్త ఎక్కువగా ఉండటంతో భూ యజమానులకు జారీ చేసి స్థలం చుట్టూ గోడ నిర్మించి చుట్టు ప్రక్కల నివసించే నిర్వాసితులకు చెత్త వేయవద్దని చెప్పాంచాలన్నారు. స్థల యజమాని నోటిసులకు స్పందించకపోతే కోర్టు ద్వారా నోటీసులు అందజేసినా స్పందించకపోతే మున్సిపల్ కార్పొరేషన్ చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఖాళీ స్థలాల భూ యజమానులు శుభ్రం చేయకపోతే మున్సిపల్ కార్పొరేషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఇందిరానగర్ కాలనీలో రోడ్డు పైనే గుంతలు ఏర్పాటు చేసుకున్న ఆ గుంతలు ద్వారా లీకేజీలు వస్తున్న వాటిని పరిశీలించి గుంతలు క్లీనింగ్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. కాలువలను పరిశీలించారు. కాలువలు లేని ప్రాంతంలో కాలువలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు చెప్పారు.

-మిగతా 2లో

ఎడిటోరియల్

# 'సాంకేతిక' సందిగ్ధం!

దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన 'ఇండియా-ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా అనేక కీలకాంశాలు తెరమీదకు వచ్చాయి. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలే ప్రశ్నార్ధకంగా మారాయి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ (ఫౌండేషన్ మోడల్) కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే నిలబడిపోయాం. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తిస్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాలా మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.
అయితే, అన్ని అంశాలకు అమెరికా వైపు చూసే నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవడం అనుమానమే! అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఇప్పటి వరకు అటువంటి ప్రకటన ఏదీ కేంద్ర ప్రభుత్వం నుండి వెలువడకపోవడమే ఈ అనుమానానికి కారణం. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే! ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నిటిఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడతాయట! ఒక వార్తా సంస్థకు ఇచ్చిన 'ప్రత్యేక' ఇంటర్వ్యూలో 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు.
'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దు తున్నాం' అని మోడీ అన్నారు. ఈ మాటలు ఎలా ఉన్నప్పటికీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తుండగా, మన దేశంలో మోడీ సర్కారు ఈ రంగ అభివృద్ధి కోసం ఎంత ఖర్చు చేయనుందన్న విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు. మరోవైపు ఎఐ వృద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను అందరితో చర్చించి పారదర్శకంగా రూపొందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అదే విధంగా దేశంలో ఉన్న యువశక్తిని సమర్ధవంతంగా వినియోగించుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్శిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి.

# చిత్రం కాదు చిరునామా...!



బంగారు ఆభరణాలతో అందాలతో
ఆమె ఒక అతిలోక సుందరి
ఆమె ఒక అజంతా శిల్పం

ఆమె ముఖంలో
విరిసిన ఆ చిరునవ్వులో
ఎంత అమాయకత్వం
ఎంత ఆత్మవిశ్వాసం ఆ చూపుల్లో
ఎంత సౌందర్యం దాగిఉందో

ఆమె భంగిమ
ఎంత సంతులితంగా
ఎంత మర్యాదగా ఉందో
ఇది కేవలం చిత్రం కాదు
మన తెలుగు సంస్కృతికి
మన సాంప్రదాయానికి చిరునామా
ఆమె సౌందర్యం ఒక సజీవ సాక్ష్యం
మన భారతీయ సంప్రదాయ
వైభవానికి ఆమె ఒక ప్రతిబింబం...

ఇదిగో చిత్రం తిలకించండి
ఈమె మన సాంప్రదాయ
సౌందర్యానికిది ప్రతిరూపం

ఆ పసుపు రంగు పట్టు చీర
ఆమె దివినుండి భువికి దిగివచ్చిన
ఒక దేవతలా దర్శనమిస్తోంది

మెరిసే ఆ చీరపై మరూన్
అంచులు బంగారు జరీతో
ఆమెలో ఉట్టిపడుతుంది రాజసం
ఆ రంగుల కలయికెంతో శోభాయమానం

ఆమె జడలో తురిమిన మల్లెపూల
పరిమళం...సంప్రదాయ సుగంధం

చెవుల్లో జుమ్కాలు, మెడలో
హారం, చేతుల్లో గాజులతో



తేరాల రాజేంద్రప్రసాద్ గుప్తా
రత్నలహరి ఛానల్, సీఈవో
9297109223, సికింద్రాబాద్

# ఏడు కొండలు...కోటి గుండెలు...




ఓం నమో నారాయణాయః..!
నమో శ్రీశైలవాసా..! నమో ఓ శ్రీనివాసా..!
నమో వెంకటేశా..! నమో ఓ తిరుమలేశా..!
మహానందమాయే ఓ మహాదేవ దేవ..!

ఓ శ్రీనివాసా..! ఓ శ్రీశైలవాసా..!!
మీ చరతం...దివ్య చరితం...
మీ నామం...పరమ పావనం...

గోవిందా గోవిందా...
ఏడు కొండలవాడా..!
వెంకట రమణా గోవిందా గోవిందా..!!
అంటూ నాలుగు దిక్కుల్లో
పిక్కటిల్లుతోంది మీ దివ్యనామం...

ఓ వెంకటేశా..! ఓ తిరుమలేశా..!!
సర్వలోకాలు ఆ శ్రీహరిమయమట...
మీరు ఆ మహావిష్ణువుకు ప్రతిరూపమట...
నేడు జగమంతా శ్రీ వెంటేశ్వరమయమట

ఏడుకొండల్లో కొలువైఉన్న ఓ కోనేటిరాయా
మూల్లోకాలను కాపాడే ఓ ముక్తి ప్రదాతా...
తరతరాలుగా యుగయుగాలుగా కోట్లాదిమంది
భక్తుల గుండెగుడిలో
ఆరనిజ్యోతిగా వెలిగే
ఓ ఆపద మొక్కులవాడా..!
ఓ అనాధ రక్షకా...
ఓ ఆపద్బాంధవా..!!

ఆదుకోవా..? మమ్ము ఆదరించవా..?
కరుణించవా..? మమ్ము కాపాడరావా..?
ఈ దీనులపై దయచూపవా ఓ దైవమా..?
మీ దర్శనభాగ్యం మాకు కలిగించవా..?

కోరము తండ్రీ మిమ్ము కోటివరాలు

ఎక్కితిమి ఏడుకొండలు...
మొక్కితిమి మీ పాదపద్మములకు...
దక్కిన చాలు మాకు మీ దర్శనభాగ్యం...
మా జన్మధన్యమేనయా ఓ జగదీశా ఓ పరమేశా...

ఏడు కొండల వాడా..!
వెంకట రమణ గోవిందా గోవిందా..!!




కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్

# శాస్త్రీయ దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

ఆహుతులను కట్టిపడేశాయి. చిన్నారులు ప్రదర్శించిన గ్రహణాల శాస్త్రీయ నిరూపణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపల్ బి. లక్ష్మణరావు మాట్లాడుతూ, రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణకు గుర్తుగా గత 25 ఏళ్లుగా తమ పాఠశాలలో ఈ సైన్స్ పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్పర్సన్ చౌదరి ధనలక్ష్మి, పాఠశాల సెక్రటరీ సీపాన లక్ష్మి, క్యాంపస్ ఇంచార్జ్ పి. సీతామహాలక్ష్మి, హైస్కూల్ ఇన్చార్జి జి.కోటేశ్వరరావు, ఎలిమెంటరీ ఇన్చార్జి ఎస్. తవిటిరాజు, లీడ్ కోఆర్డినేటర్ కె. రాజేశ్వరి చౌదరి పాల్గొన్నారు. అలాగే సైన్స్ ఉపాధ్యాయులు యు. మోహనరావు, కె. ఇందుమతి, జి. అరుణ, గణిత ఉపాధ్యాయురాలు కె. అరుణతో పాటు ఇతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ డే



**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బి ఎస్ చక్రవర్తి,ప్రిన్సిపాల్ కె శివశంకర్ సి వి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించి అనంతరం మాట్లాడుతూ సైన్స్ లేనిదే మానవ మడుగద లేదన్నారు,ప్రస్తుతం సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు, భారతదేశం కూడా శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుందన్నారు, సి వి రామన్ తన పరిశోధన రామన్ ఎఫెక్ట్ ను ఫిబ్రవరి 28 న దృవీకరించుకొని ప్రపంచ దేశాలకు భారత దేశ కీర్తీ ప్రతిష్టలను రెపరెపలాడించారన్నారు,భౌతిక శాస్త్రం లో భారతదేశం తరుపున మొట్టమొదటి నోబెల్ బహుమతి అందుకున్నారని గుర్తుచేశారు,అదేవిదంగా భారతదేశం భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు, నేటి యువత పరిశోధనలుపైన దృష్టి పెట్టాలన్నారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు,ఎన్ఎస్ఎస్ పిఓ లు హరిమానస,పైడి రాజు,విద్యార్థినిలు పాల్గొన్నారు.

# పేదలకు 18 లక్షల ఇళ్లు ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

టవర్లు ఏర్పాటుచేసి సిగ్నల్ వ్యవస్థను కల్పించి సాంకేతిక విప్లవం తీసుకురానున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి డిప్యూటీ సీఎం 25 కోట్ల రూపాయలను మంజూరు చేశారని ప్రతి మారుమూల ప్రాంతాల్లో రహదారుల సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ చేయమని అన్నారు. జల జీవన్ మిషన్ కింద నియోజకవర్గానికి 600 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తొలి విడుదల 100 కోట్లు మంజూరు చేసామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ లో భగంగా గ్రామాల్లో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించనున్నామన్నారు. నియోజవర్గంలోని కొండపేట, మదన గోపాల సాగరం ఎత్తిపోతల పథకాలు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు మొదటి విడతలో సుమారు రూ.9.40 కోట్లు అవసరం ఉందని, పునఃప్రారంభం చేసి ప్రతి ఎకరానికి నీరు అందించే విధంగా రైతులకు ప్రయోజనం చేకూర్చున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతున్న దృష్ట్యా మహిళలకు మరింత సౌకర్యానికి ఈ ఏడాది విడతల వారీగా కొత్త ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రం లో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ సంక్షేమము, అభివృద్ధితో పాటు అన్ని రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్రం ప్రగతి పథంలో పయనించే విధంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజా సేవలో కార్యక్రమంలో భాగంగా పర్యటించి క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించి గ్రామాలు అభివృద్ధి సాధించాల కార్యక్రమ ఉద్దేశమని అన్నారు.

## పాడి రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలి

పాడి రైతులు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అన్నారు. కోటబొమ్మలి మండలం మణి నాగేశ్వర పురంలో మినీ గోకులం ను మంత్రి ప్రారంభించారు.
జాతీయ ఉపాధి హామీ పథకం కింద అంచనా వ్యయం రెండు లక్షల 30 వేల రూపాయలతో మినీ గోకులం నిర్మించారు.
ఈ కార్యక్రమంలో మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరి ప్రసాద్, పి ఏ సి ఎస్ అధ్యక్షులు వెలమల విజయ లక్ష్మి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.కిరణ్ కుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ లవరాజు, ఆర్డీవో ఎమ్.కృష్ణ మూర్తి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జగన్మోహన్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు లోకనాథం, తహసీల్దార్ ఆర్.అప్పల రాజు, ఎంపిడిఓ కె. ఫణేంద్ర కుమార్, ఏ పిడి శైలజ, ఏ పి వో జీ.హరి ప్రసాద్, మాజీ జెడ్ పి టి సి ఎన్.శ్రీనివాస్, బోయిన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దేవకన్యలు ఆరాధించిన కన్యతీర్థం శ్రీ త్రిపుర సుందరీ దేవి క్షేత్రం -కడప జిల్లా




సప్తమాతృకా క్షేత్రంగా, దేవ తీర్థంగా, అగస్త్యాశ్రమంగా కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంలా పురాణ కాలంనుండి విరాజిల్లుతున్నది ఈ పుణ్యక్షేత్రం.

దేవ కన్యకలు, దేవాది దేవతలు, మునులు, సిద్ధ పురుషులు, మహాపురుషులు, చక్రవర్తులు, రాజులు ఈ క్షేత్రంలోని త్రిపుర సుందరి అమ్మవారిని సేవించుకొన్నట్లు పురాణాలు, చారిత్ర ఆధారాలు చెబుతున్నాయి. పచ్చటి చెట్ల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో మనసుకు హాయి కలిగించేలా ఉన్న పరిసరాలలో ఈ క్షేత్రంలో విజయదుర్గ అమ్మవారిని ప్రతిరోజు స్వర్గం నుంచి దిగివచ్చి దేవకన్యలు దర్శించుకుంటారని, ముఖ్యంగా కన్యలకు మాత్రమే ఈ దేవాలయం అత్యంత పవిత్రతను సంతరించుకున్న కన్య తీర్థంగా గొప్ప ప్రసిద్ధి.

ఈ దేవాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా జమ్మలమడుగు దగ్గర దండ్లూరి గ్రామ పొలిమేరలో పినాకిని నది ఒడ్డున భానుకొండల మధ్య అత్యంత సుందరంగా అమ్మ వారి క్షేత్రం మనకు కనిపిస్తుంది. అన్ని దేవాలయాల్లో అమ్మవారికి పీఠం ఉన్నట్టుగా ఈ అమ్మవారికి ఎక్కడ కూడా పీఠం కనిపించదు అంతేకాదు అమ్మవారి విగ్రహం శిలా భూమి లోపల ఎంతవరకు ఉందో కూడా తెలియదట. దేవకన్యలు ఇక్కడికి వచ్చి పుష్కరిణిలో స్నానమాచరించి అమ్మవారిని దర్శించుకునేవారట. ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా కోరిన కోర్కెలు కచ్చితంగా ఇక్కడి అమ్మవారు నెరవేరుస్తుందట.

ఆలయ స్థల పురాణం

మండలంలోని పెద్దండ్లూరు గ్రామం వద్ద పినాకినీ నదీ తీరాన భాను కొండల మధ్య సుమారు 5వేల ఏళ్లకు పూర్వం త్రిపుర సుందరి దేవి స్వయంభుగా ఈ క్షేత్రంలో వెలిసినట్లు ఆలయంలోని శాసనాలు చెబుతున్నాయి. ఈ క్షేత్రంలోని పుష్కరిణిలో అలనాడు దేవకన్యకలు



నిత్యం స్నానమాచరించి అమ్మవారిని సేవించుకోవడం వల్ల ఈ క్షేత్రానికి శ్రీకన్యతీర్థం అని పేరు వచ్చినట్లు పురాణాలు చెబుతున్నాయి. అలాగే దేవేంద్రుడు మొదలుకొని దేవతలు క్షేత్రంలో అమ్మవారిని సేవించుకొన్నందువల్ల దేవతీర్థం అని కూడా పేరుంది. కన్నెతీర్థమందు కొలువై ఉన్న త్రిపుర సుందరి మాత వెలసి ఇప్పటికి సుమారు 5 వేలు సంవత్సరాలకు పైగా అయినట్లు గుడిలోని శాసనాల ద్వారా తెలుస్తున్నది.

ఈ గుడి సమీపంలోనే అగస్త్యాశ్రమం ఉన్నది. వింధ్య పర్వతాల మదమణచడానికి వచ్చిన అగస్త్య మహాముని చాలా కాలం జమ్మలమడుగు మండలంలోని చారిత్రక ప్రాంతం అయిన గండికోటకు ప్రక్కనున్న కోనలో నివాసం ఉన్నట్లు పురాణాలు తెలుపుతున్నాయి. అందువల్ల ఆ కోనకు అగస్త్యేశ్వర కోన అనే పేరు వచ్చింది. అగస్త్యుడు ప్రతి రోజూ గండికోట నుండి కన్నెతీర్థం వచ్చి దుర్గామాతను కొలిచివేళ్లే వాడని ప్రతీతి.

ఇక్కడ వారాహి,వైష్ణవి,బ్రహ్మాణి,మహేశ్వరి, కౌమారి, చాముండి ,ఇంద్రాణి వంటి ఏడు మంది దేవతలు ఒకే చోట కొలువై ఉండటం వల్ల ఈ క్షేత్రాన్ని సప్తమాతృక క్షేత్రమని ,దేవేంద్రుడు రావడం వల్ల దైవ క్షేత్రమని , అగస్త్య మహర్షి తపస్సు చేయడం వల్ల ఈ క్షేత్రాన్ని ఆగస్త్య క్షేత్రం అని ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు.

క్షేత్రంలో నేటికి శ్రీ అగస్త్య ఆశ్రమం వుంది. దేవతలు, మహాపురుషులు, సిద్ధ పురుషులు, మునులు అమ్మవారిని సేవించుకున్నారు. అలాగే క్రీ.పూ ఆచార్య సిద్ధ నాగార్జునుడు, ఆర్య వంశ స్థాపకుడు చంద్రగుప్తుడు. అశోక చక్రవర్తి అమ్మవారిని దర్శించుకొని సేవించుకున్నట్లు తెలుస్తోంది. అలాగే క్రీ.శ 2 నుండి 7వ శతాబ్దం కాలంలో శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యులు, శాతవాహనులు, చోళులు, హర్షవర్ధనుడు శ్రీత్రిపుర సుందరీ దేవి అమ్మవారిని పూజించినట్లు స్థల పురాణాలు చెబుతున్నాయి.

క్రీ.శ.11వ శతాబ్దంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన ఆంధ్రభోజుడుగా పేరొందిన శ్రీ కృష్ణదేవరాయులు క్షేత్రంను అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ఆ తరవాతి కాలంలో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ, కాలజ్ఞాన బ్రహ్మ పోతులూరి శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వాముల వారు అమ్మవారిని సేవించినట్లు తెలుస్తోంది.

క్షేత్రం విశేషాలు:

కన్యతీర్థం పుణ్యక్షేత్రంలో సప్తమాతృకా క్షేత్రం అత్యంత పురాతనమైనది. క్షేత్రంలోని అమ్మవారు బ్రహ్మాణి, మహేశ్వరి, కౌమారి, వారిహి, వైష్ణవి, ఇంద్రాణి, చాముండి అనే పేర్లతో వృక్షాలు వున్నాయి. క్షేత్రంలో విఘ్నేశ్వర స్వామి, కాదంబరేశ్వరి దేవి, శక్తేశ్వరి, సుబ్రమణ్యం స్వామి, సప్తమాతృకలు, నాగదేవత విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉన్నాయి. క్షేత్రం మహిమలు గురించి పరాశర మహాముని రాసిన స్కంద పురాణంలోనూ, జైమిని భారతంలోనూ, శ్రీశైల పురాణంలోనూ గొప్పగా వివరించారు.

కన్యతీర్థంలోని శ్రీత్రిపుర సుందరీ దేవి రూపంలో వున్న విజయదుర్గ అమ్మవారి మహిమలు విని జైనులు ఇక్కడికి వచ్చి అమ్మవారిని సేవించుకున్నారు. దీనికి తార్కాణంగా జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రూటులో నాటి దేవనహళ్లి అయిన నేడు దేవగుడి వద్ద బాహుబలి విగ్రహం వుంది. దీనికి నిదర్శనంగా ఇప్పటికీ అమ్మవారి గుడి పైభాగాన సిద్ధ, బౌద్ధ అస్తికల గూళ్లు చూపరులకు దర్శనమిస్తాయి.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## - అత్యవసరం సమావేశములో జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమ నాయుడు




**నవతరం -అమరావతి**

ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ఆంధ్రప్రదేశ్ గవెర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. విజయవాడ గాంధీనగర్ లోని ఒక ప్రైవేట్ హోటల్ లో జరిగిన సమావేశపు మందిరంలో ఆంధ్రప్రదేశ్ గవెర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసభ్య సమావేశం చైర్మన్ చౌదరి. పురుషోత్తం నాయుడు అధ్యక్షతన, సెక్రటరీ జనరల్ జి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శు క్రవారం జరిగింది. ఇందులో జిల్లాల నుండి వచ్చిన వివిధ డిపార్ట్మెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, ఏపీఎన్జిఓ మాజీ ప్రధాన కార్యదర్శి పాలంకి సుబ్బారాయన్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 2 సంవత్సరాలు అవుతున్న ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలు పెన్షనర్స్ సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం, తగ్గించిన క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించక పోవటం శోచనీయం అని తెలిపారు. ఇచ్చిన హామీలను ఉద్దేశపురకంగా చర్చల పేరుతో ఉద్యోగ, పెన్షన్ దారులకు ఇవ్వవలసిన ప్రయోజనాలను అందివ్వకుండా కాలయాపన చేస్తుందని, ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల పెన్షన్లదారులను పట్టించుకోకుండా గాలికి వదిలివేయడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందన్నారు. ఎంతో మంది పెన్షన్దారుల తమ ఆర్థిక ప్రయోజనాలను పొందకుండానే చూస్తూ చూస్తూ దీన స్థితిలో చనిపోతున్నారని, ప్రభుత్వం గమనించి పెన్షన్దారులకు రావలసిన అన్నిరకాల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని, ప్రభుత్వం తమ నిర్లిప్తతను విడనాడాలన్నారు.

**డిమాండ్స్ :**

ఎన్నికల మానిఫేస్టో హామీ ప్రకారం పెన్షనర్స్ సంక్షేమ కార్పోరేషన్ తక్షణమే ఏర్పాటు చేయాలి. గత 11వ పిఆర్ సి ముగిసి దాదాపు 30 నెలలు గడిచిన, ఇప్పటివరకు కొత్తవేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయకపోవటం ఉద్యోగుల్లో పెన్షనర్లో తీవ్ర ఆందోళనకు కారణమైనది, కనుక వెంటనే ప్రభుత్వం 12 వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలనీ ఈ అంశాన్ని ప్రాధాన్యతతో సానుకూలంగా పరిగణించి త్వరితగతంగా నిర్ణయాన్ని ఉగాదిపండుగ లోగా ప్రభుత్వం తీసుకోవాలని సమావేశం డిమాండు చేస్తుంది. అలాగే 30% ఇంటీరియం రిలీఫ్ను ప్రకటించాలని, రావలసిన నాలుగు పెండింగ్ డియర్ నెస్ బకాయిలును వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు వ్యతిరేఖముగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ లను తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. సిపియస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, పెన్షన్ ప్రయోజనాలను మెడికల్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన మరుసటి రోజునాడే పెన్షన్ ప్రయోజనాలనూ, రావలసిన అన్నిరకాల పెన్షనర్స్ బెనిఫిట్స్ ను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2013నవంబరులో ప్రారంభించిన ఈహెచ్ఎస్ పథకం దశాబ్ధకాలం గడిచినా, ఇప్పటికి పూర్తి స్థాయిలో అమలు కాకపోటం వల్ల ముఖ్యంగా పెన్షనర్స్ తీవ్ర ఇబ్బ0దులని ఎదుర్కోంటున్నారని, కాలం చెల్లిన వైద్య ప్యాకేజీ రేట్లు పెంచకపోవడం, ఆసుపత్రులకు లక్షలాది రూపాయల బకాయలు పేరుకుపోవడంతో పెన్షనర్స్ కు నాణ్యమైన సేవలు నిలిచిపోతున్నాయన్నారు. .అన్నీ నెట్ వర్క్ ఆసుపత్రులలో దీర్ఘకాలిక వ్యాధులకు నాణ్యమైన చికిత్సలు, రోగికి తగిన ఉచిత మెరుగైన మందులు అందివ్వాలని, మెడికల్ రీఎంబెర్స్ మెంట్ పరిమితిని 2 లక్షలు నుంచి 7 లక్షలరూపాయల కు పెంచాలన్నారు. జిల్లా స్థాయిలో మెడికల్ రీయంబెర్సెమెంట్ ఆమోద పరిమితిని 50 వేల నుంచి 2 లక్షల వరకు పెంచాలని, పెన్షనర్స్ మెడికల్ బిల్లులను ఆఫ్ లైన్ ద్వారా కూడా బిల్లులను తీసుకొనే వెసులుబాటు కల్పించాలని, వైద్య ఖర్చుల బిల్లులు సకాలంలో చెల్లించక పోవటంతో ఎంతోమంది పింఛనుదారులు అప్పుల బారినపడి తీవ్ర మైన వేదనకు గురౌతున్నారన్నారు. పెన్షనర్స్ కు తగ్గించిన 3% అడిషనల్ క్వంటం ఆప్ పెన్షన్ రిస్టోర్ చేయాలని, కమ్యేషన్ రికవరీ 15 సంవత్సరాలకు నుంచి 12 ఏళ్లకు తగ్గించాలని, సీనియర్ సిటిజెన్స్ కు రైలు, విమాన ప్రయాణ ఛార్జ్ లలో రాయతీలు పునరుద్ధరించాలని తెలిపారు. అలాగే ఆదాయపు పన్ను మినహాయంపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ సమూహ సమావేశములో వివిధ డిపార్ట్మెంట్లకు చెందిన పెన్షనర్స్ సంఘాలు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ పెన్షనర్ల సంఘం, పశుసంవర్ధక శాఖ, రవాణా శాఖ ఎండోమెంట్స్, విద్యాశాఖ మెడికల్, ఆరోగ్యశాఖ, సెక్రటేరియట్ ఇరిగేషన్,నర్స్ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలి

**నవతరం-రాజాం**





ఈరోజు రాజాంలో మరణించిన లచ్చయ్య పేట వాసులు అయిన అల్లాడ సూర్యారావు 70 సంవత్సరాలు వయసులో మరణించడంతో, కుటుంబ సభ్యులు మరియు బింగి రంగనాథం గారి ప్రోత్సాహంతో అల్లాడ సూర్యారావు గారి నేత్రాలను దానం చేశారు. వారి నేత్రాలను దానం చేసినందుకు గాను వారి కుటుంబ సభ్యులను, రాజాం రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు అభినందించి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం ఆధ్వర్యంలో ఐ టెక్నిషియన్ ఆబోతుల రమణ నేత్ర సేకరణ చేశారు. కొన్ని లక్షల మంది కళ్ళు లేక బాధ పడుతున్నారని కాబట్టి ప్రతీ ఒక్కరూ మరణాంతరం నేత్ర దానం చేసి ఇతరుల జీవితాలలో వెలుగులు నింపాలని విజయనగరం రెడ్ క్రాస్ చైర్మన్ కె ర్ డి ప్రసాద్, శ్రీకాకుళం రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన రావు, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో బింగి రంగనాథం కుటుంబ సభ్యులు భ్రమరాంబ, చంద్ర, సాయి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఎవరైనా నేత్ర దానం చేయదలచిన వారు రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్ 9440131160, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్ 9441708120 లను సంప్రదించాలని కోరారు. లచ్చయ్య పేట యువతకు కాలనీ వాసులకు రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్ నేత్ర దానం పై అవగాహన కల్పిస్తూ, గత సంవత్సరం సూర్యారావు గారి కుమారుడు కూడా మరణాంతరం అతని నేత్రాలను దానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారని తెలియచేశారు.

# డయేరియా కట్టడికి 'పారిశుధ్య' వ్యూహం

## - వార్డుల వారీగా 21మంది ప్రత్యేక అధికారులను నియమించిన కలెక్టర్

## - ఉదయం 5:30 నుంచే విధుల్లో ఉండాలని ఆదేశం

**నవతరం -శ్రీకాకుళం**



నగరంలో డయేరియాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని వార్డు సచివాలయాలకు వివిధ శాఖల ఉన్నతాధికారులను 'ప్రత్యేక అధికారులు'గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అధికారులు ప్రతిరోజూ ఉదయం 5:30 గంటలకే తమకు కేటాయించిన వార్డుల్లో రిపోర్ట్ చేయాలని, క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని, యుద్ధ ప్రాతిపదికన పూడికతీత, వ్యర్థాల తొలగింపు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డుకు కనీసం ఆరుగురు పారిశుధ్య కార్మికులు, ఒక ట్రాక్టర్‌ను కేటాయించగా, ప్రతి రెండు వార్డులకు ఒక జేసీబీ యంత్రాన్ని అందుబాటులో ఉంచారు. కాకివీధికి ప్రయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. వెంకటరమణ, మంగువారితోటకు జిల్లా భూగర్భ జల అధికారి ఎన్.వి.కె. దుర్గా ప్రసాద్, హెచ్ బి కాలనీ, గూనపాలెం లకు పర్యావరణ శాఖ ఇంజనీర్ కరుణశ్రీ, దమ్మల వీధి, హయాతనగరంలకు బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ వంటి ఉన్నతాధికారులను బాధ్యులుగా నియమించి పనులను వేగవంతం చేశారు. మొత్తంగా 21 మంది జిల్లా ఉన్నతాధికారులు వారికి కేటాయించిన వార్డులోని ప్రతి క్లస్టర్‌ను పరిశీలిస్తూ, పారిశుధ్య కార్మికుల హాజరును, పనితీరును నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. మరోవైపు నగరంలో డయేరియా బాధితుల సంఖ్య నిలకడగా ఉందని, భయపడాల్సిన పని లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

# హిందీ ప్రతిభా పరీక్ష జిల్లా స్థాయి విజేతలు వివరాలు

**నవతరం-శ్రీకాకుళం**

హిందీ సేవా సదన్ (అనంతపురం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు జరిగిన జిల్లాస్థాయి హిందీ ప్రతిభా పరీక్షలో జిల్లాస్థాయి టాపర్ విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. విజేతల వివరాలను హిందీ సేవా సదన్ వ్యవస్థాపకులు ఎస్. గైబువల్లి, హిందీ మంచ్ ప్రతినిధులు కోనే శ్రీధర్, కనుగుల సత్యం శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలియజేశారు.

పదవ తరగతిలో మేఘన (ఏపీ మోడల్ స్కూల్, కరవంజ) మొదటి స్థానాన్ని, దేవీప్రియ (జిల్లా పరిషత్ హై స్కూల్, పైడి భీమవరం) ద్వితీయ స్థానాన్ని, యమున (మోడల్ స్కూల్, కరవంజ) మరియు శ్రీశాంత్ (శాంతినికేతన్, రణస్థలం) లు తృతీయ స్థానాన్ని సాధించారు.

9వ తరగతిలో హారిక (జడ్పీ హైస్కూల్, బలాడ), రాజేశ్వరరావు (బీసీ సంక్షేమ ఆశ్రమ పాఠశాల, నరసన్నపేట), నిఖితారెడ్డి (బీసీ సంక్షేమ ఆశ్రమ పాఠశాల, టెక్కలి), దక్షశ్రీ (ఆక్స్ఫర్డ్ స్కూలు, పాత శ్రీకాకుళం) లు మొదటి మూడు స్థానాలు సాధించారు.

8 వ తరగతిలో జాహ్నవి (బీసీ సంక్షేమ ఆశ్రమ పాఠశాల, టెక్కలి), కోమలి (క్రాంతి స్కూల్, సింగపురం), సునీత (జడ్పీ హైస్కూల్, మడపం), జయరాం (బిసి సంక్షేమ ఆశ్రమ పాఠశాల, నరసన్నపేట) మొదటి మూడు స్థానాలు సాధించారు.

7 వ తరగతిలో జయదీప్ (బీసీ సంక్షేమ ఆశ్రమ పాఠశాల, నరసన్నపేట) మొదటి స్థానాన్ని, తనీషా (జెడ్పీ హైస్కూల్ , బలాడ), భానుశ్రీ (జడ్పీ హైస్కూల్, మడపాం) లు రెండవ స్థానాన్ని, మీనాక్షి కుమారి (ట్వింకిల్ స్కూల్, రణస్థలం), సహస్ర (ఆక్స్ఫర్డ్ స్కూల్, పాత శ్రీకాకుళం) లు తృతీయ స్థానాన్ని పొందారు.

6 వ తరగతిలో ఈశ్వరి (జడ్పీ హైస్కూల్, జేఆర్ పురం/రణస్థలం), జ్ఞానదీప్ (జడ్పీ హైస్కూల్, గొర్లెపేట), జయప్రీత్ (ఎంపీయుపి స్కూల్, రావిపాడు) లు మొదటి మూడు స్థానాలు పొందారు.

విజేతలకు మార్చి 1 ఆదివారం నాడు రణస్థలం మండల కేంద్రంలో జరగనున్న ఉత్తరాంధ్ర స్థాయి జిల్లా టాపర్ విద్యార్థుల అభినందన సభలో సత్కరించుకున్నట్టు తెలిపారు. అభినందన సభ మార్చి 1 న రణస్థలం లోని భాష్యం స్కూల్ ఆవరణలో ఉదయం 9:30 గంటలకు జరగనుందని వారు తెలిపారు. విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్. ఈశ్వరరావు, డీఈవో రవిబాబు, విశ్రాంతి డీఈవో బలివాడ మల్లేశ్వరరావు తదితరులు సభకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో విజేతల విద్యార్థులతో పాటు, హిందీ భాషాభివృద్ధికి కృషి చేసిన ప్రముఖులను, హిందీ ఉపాధ్యాయులను సత్కరించనున్నట్టు గైబువల్లి, కోనే శ్రీధర్, సత్యంలు తెలిపారు.

# శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

- విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించేందుకు వినూత్న ప్రదర్శనలు
- రోబోటిక్స్, సైన్స్ ప్రయోగాలు, పర్యావరణ ప్రాజెక్టులు ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ



**నవతరం-శ్రీకాకుళం**

బలగ నందు గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఫిబ్రవరి 28న జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించేందుకు, సృజనాత్మక ఆలోచనలకు వేదికగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్ర మౌళి తెలిపారు.

ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఈఓ శ్రీమతి ఆర్. విజయ కుమారి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించి వారికి దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఎంఈఓ శ్రీ ఎన్. కృష్ణ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం శ్రీ ఎం.వి. సురేష్ మాట్లాడుతూ విజ్ఞానంతోనే ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు. రీజనల్ ఇన్‌చార్జ్ రామినాయుడు విద్యార్థులు కొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో శ్రీ చైతన్య స్కూల్స్ ఎల్లప్పుడూ ముందుంటాయని సమన్వయకర్త బాలరాజు తెలిపారు.

విద్యార్థులు రూపొందించిన రోబోటిక్స్ మోడల్స్, సైన్స్ ప్రయోగాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజ్ఞాన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు శాస్త్రంపై మరింత ఆసక్తి కనబరచాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రైమరీ కోఆర్డినేటర్ అప్పారావు, డీన్ జగదీష్, సి అండ్ ఐకాన్ ఇన్‌చార్జి మల్లేశ్వరరావు, ప్రైమరీ ఇన్‌చార్జ్ ఉషారాణి, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ మనోరమ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ యశోధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టెక్కలి నియోజకవర్గంలో జనసేన "ఉద్యమి"

# క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం

**ఇంచార్జ్ కనితి కిరణ్ కుమార్**



**నవతరం టెక్కలి**

జనం కోసం జనసేన - జనంలో జనసేన... శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో... బిఒక పండగలా సభ్యత్వ నమోదు... బికార్యకర్తలకు అండగా నిలిచే పార్టీ జనసేన పార్టీ. బిటెక్కలి జనసేన ఇంచార్జ్ కణితి.కిరణ్ కుమార్ నేడు టెక్కలినియోజకవర్గంజనసేన పార్టీ "ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఉద్యమి సభ్యత్వ పార్లమెంటరీ ఇంచార్జ్ కొరికన రవి కుమార్ మరియు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని.చంద్ర మోహన్ హాజరైనారు. ముందుగా కాకరాపల్లి థర్మల్ పవర్ ప్లాంట్ లో జరిగిన కాల్పులలో మరణించిన వారికి నివాళులు అర్పించారు.తరువాత సుడా చైర్మన్, జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ ఆశయాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లే ఈ సభ్యత్వ కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పార్టీకి చేర్చి మరింత బలోపేతం చేసేవిధంగా ముందుకు సాగమని దిశనిర్దేశం చేసారు.అనంతరం ఇంచా ర్జ్ కణితి కిరణ్ కుమార్ తో టెక్కలి పట్టణంలో పర్యటించి దుకాణదారులు, చిరు వ్యాపారులను కలుసుకొని జనసేన పార్టీ సిద్ధాంతాలు, సభ్యత్వం ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. పలువురు వ్యాపారులు, యువత, కార్యకర్తలకు స్వయంగా సభ్యత్వం నమోదు చేసికొని వారు అభినందనలు తెలియజేశారు. అలాగే జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త, ప్రతి కుటుంబం జనసేన కుటుంబంలో భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నిర్వహణ కమిటీ సభ్యులు మండల అధ్యక్షులు నియోజకవర్గం నాయకులు ఉద్యమి సాధక్ లు పార్టీ సీనియర్ నాయకులకు తదితరులు పాల్గొన్నారు..

# జనసైనికుడు కుటుంబానికి జనసేన నేతల ఆర్థిక సహాయం

**నవతరం-ఎచ్చెర్ల**



మండలంలోని ముద్దాడ పంచాయతీకి చెందిన జనసేన పార్టీ కార్యకర్త సాధు నవీన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డా,, సయ్యద్ విశ్వక్సేన్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా పొన్నాడకు చెందిన జనసేన నాయకుడు పాకల కిషోర్ రూ.5,000 సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన్ మాట్లాడుతూ నవీన్ అకాల మరణం పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, బెండు లీలమోహన్, జనసేన నాయకులు బలగ మోహనరావు, జి. మురళి, వి. సంతోష్, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానంకు మించిన దానం లేదు

**- ఎక్స్ ఆర్మీ బబ్బోజి.వరప్రసాద్**

**నవతరం-శ్రీకాకుళం**



అన్నదానంకు మించిన దానం లేదని, ఎక్స్ ఆర్మీ బబ్బోజి.వరప్రసాద్ అన్నారు. స్థానిక సూర్యమహాల్, రామలక్ష్మణ కూడలి, అరసవల్లి కూడలి, పట్టణ నిరాశ్రయాయుల భవనంలో నిస్సాహాయులకు అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ పిలుపు మేరకు ఈ రోజు నా జన్మదినాన్ని పది మంది పేదల మధ్యలో జరుపుకోవటం ఆనందంగా ఉందని, పొలము గ్రామానికి చెందిన ఎక్స్ ఆర్మీ బబ్బోజి.వరప్రసాద్ తెలిపారు. పది మంది ఆకలి తీర్చటంలో ఆనందం వేరని, ఈ మహోత్తర కార్యక్రమాన్ని షెల్టర్ నిర్వాహకురాలు వైశ్యరాజు.వెంకట లక్ష్మి, తదితరుల చేతుల మీదుగా అందించామన్నారు. అనంతరం షెల్టర్ నివాసకులకు రోజువారి అవసరమైన కిట్లను అందించారు.
ఈ సేవా కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజ్ సెక్రటరీ చీపుర. రమణ, మండలవీధి మణిరత్నం, బాడీ బిల్డర్ విజయ్ కుమార్, కోల.కేశవ, సూర్య, షెల్టర్ అభాగ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాల యజమానులకు నోటీసు జారీ చేయాలి

మొదటిపేజీ తరువాయి

**డయేరియా పూర్తిగా తగ్గింది...**

డయేరియా పూర్తి గా తగ్గిందని, రానున్న మరో రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలను కోరారు. ఇంటింటి సర్వోలోను డయేరియా కేసులు కేసులు తగ్గాయన్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం 96 కేసులు ఉన్నాయని, ఈ కోలి బాక్టీరియా వలన కేసులు వచ్చినట్లు చెప్పారు. చేపల మార్కెట్ వద్ద లీకేజీ గుర్తించడమైనదని, తాగునీరు సరఫరాకు సంబంధించి ఇన్వెస్ట్ గేషన్ జరుగుతోందని, ఇన్వెస్టిగేషన్ పూర్తి అయితే బాధ్యులపై మరింత మంది పై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలంతా వేడిచేసిన నీటిని మాత్రమే త్రాగాలని కోరారు. ప్రజలంతా సహకరించాలన్నారు. 7 రోడ్ల కూడలి నుండి మెయిన్ రోడ్డు (జిటీ రోడ్డు) నుండి రైతు బజార్ కు వెళ్లే రహదారి కాలువలు, సూర్యమహల్ రోడ్డు వైపు వెళ్లే మెయిన్ రోడ్డు కాలువలను పరిశీలించి లీకేజీలు ఉన్న ఆయా షాపుల యజమానులతో మాట్లాడి లీకేజీలు నివారించాలని, లేదంటే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

## ఉపాధ్యాయుల ప్రొబేషన్ నియామకాలు

# జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు

**నవతరం-శ్రీకాకుళం**

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్/ప్రభుత్వ మరియు మునిసిపల్ యాజమాన్య పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా సంచాలకులు, ఆంధ్రప్రదేశ్, అమరావతి వారి ఆదేశాల ప్రకారం సర్కార్ రెడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్ మరియు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ప్రొబేషన్ నియమాలకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి వారి వెబ్‌సైట్‌లో సమాచారం అందుబాటులో ఉంచబడిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు, ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున పై తెలిపిన ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం వారి వెబ్‌సైట్ లింక్ (https://www.sites.google.com/site/deosklorg/??) లో తమ ప్రొబేషన్ నియమాలకు సంబంధించిన జాబితాను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే 07-03-2026 న ఉదయం 10.30 గం. నుండి సాయంత్రం 5.00 గం. లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి తగిన ధృవపత్రాలతో (ఆధారాలతో) సమర్పించాలని ఆయన తెలిపారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**